కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

హనుమాన్ చాలీసా

శ్రీరస్తు

శుభమస్తు

- భావార్థముతో -



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే॥

హనుమాన్ చాలీసా

దోహా

(సాహిత్యపరంగా హనుమంతుని యొక్క 40 శ్లోకములు. ఇది రాముని ప్రసిద్ధ భక్తుడైన తులసీదాసు అవధి భాషలో వ్రాసినదని నమ్మబడుతోంది. తులసీదాసు యొక్క ప్రసిద్ధ రచన రామచరితమానస "చాలీసా" అనే పదం "చాలీస్" అనే పదం నుండి వచ్చినది. దీని అర్థం హిందీ భాషలో "నలభై" అని. అనగా హనూమన్ చాలీసాలో నలభై శ్లోకములు ద్విపదులుగా ఉంటాయి.)

శ్రీ గురు చరణ(న) సరోజ రజ నిజమన(ను)
ము(మ)కుర(రు) సుధా(ర)రి।
వరణౌ రఘువర విమల యశ జో దాయక ఫలచా(ర)రి॥

శ్రీ గురుదేవుల పాద పద్మాల పవిత్ర ధూళితో నా మనస్సు అనే అద్దాన్ని చక్కగా కడిగి ధర్మార్థ కామ మోక్షాలనే నాల్గు ఫలాలను ఇవ్వగల శ్రీరామచంద్రుని నిర్మల యశస్సును వర్ణించటానికి ప్రయత్నించుతాను.

శ్రీ గురు పాద పద్మాల నుండి పుప్పొడిచే నా మనస్సు అనే అద్దమును శుభ్రము చేసుకొని... శ్రీ రామచంద్రుని నిర్మలమైన కీర్తిని వర్ణించడం వల్ల నాకు నాలుగు ఫలాలు లభిస్తాయి. (ధర్మ, అర్థ, కామ మరియు మోక్షం).

బుద్ధిహీన త(స)ను జానికై(కే) సుమిరౌఁ పవన కుమార(రౌ)।
బల బుద్ధి విద్యా దేహు మోహి హరహు కలేశ(స) వికా(ర)ర్॥

నా బుద్ధిహీనతను గుర్తించి ఆంజనేయుని స్మరించుతున్నాను. ఓ పవనపుత్రా, నాకు శక్తిని, బుద్ధిని, విద్యను ప్రసాదించు; నా దోషాలను, వికారాలను తొలగించు.

బుద్ధిహీనత వలన ఈ శరీరము కలిగినదని తెలుసుకుని పవన కుమారుని తలచెదను. అతని వలన నాకు బుద్ధి, విద్య, బలము వచ్చుటయే కాక కామాది వికారాల వలన కలిగెడికష్టములను తొలగించుగాక.

ధ్యానమ్

గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసమ్।
రామాయణ మహామాలా రత్నం వందే అనిలాత్మజమ్॥
యత్ర యత్ర రఘునాథ కీర్తనం తత్ర తత్ర కృతమస్త కాంజలిమ్।
భాష్పవారి పరిపూర్ణ లోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్॥

చౌపాఈ

01. జయ హనుమాన జ్ఞాన గుణ సాగర।
జయ కపీశ తిహుః లోక ఉజాగర॥

జ్ఞాన సద్గుణ సాగరమైనటువంటి ఓ హనుమన్మూర్తీ! ముల్లోకాలకు జ్ఞానకాంతి నిచ్చే కపీశ్వరా! జయం! జయం!

జ్ఞానగుణ సముద్రుడవయిన ఓ హనుమంతా నీకు జయము కలుగుగాక. ముల్లోకాలను (స్వర్గం, భూమి మరియు నరకం) ప్రకాశింపజేసే ఓ కపీశ్వర! నీకు జయము కలుగుగాక!

02. రామదూత అతులిత బలధామా।
అంజని పుత్ర పవనసుత నామా॥

శ్రీరామునికి దూత ఐనవాడా! సాటిలేని బలానికి నిలయమైనవాడా! అంజనాదేవి కుమారా! వాయుదేవుని పుత్రా!

ఓ రామ దూతా! జయము కలుగుగాక! అంజనీ తనయా! వాయు పుత్రుడను నామము గలవాడా!

03. మహావీర విక్రమ బజరంగీ।
కుమతి నివార సుమతి కే సంగీ॥

మహావీరా! పరాక్రమధీరా! వజ్రంలాంటి సుదృఢ దేహం గలవాడా! దుర్బుద్ధిని నశింపచేస్తూ, సద్బుద్ధిని పెంపొందించే వాడా!

మహావీరా! విక్రమ స్వరూపం గలవాడా! వజ్రం వంటి శరీరము గలవాడా! దుర్బుద్ధులను పారద్రోలేవాడా! సద్బుద్ధిగలవారలకు చేయూత నిచ్చేవాడా!

04. కంచన వరణ(న) విరాజ సువేశా(సా)।
కానన కుండల కుంచిత కేశా(సా)॥

బంగారు కాంతుల మేనిచ్ఛాయ వాడా! అతి సుందరమైన వేషదారణం గలవాడా! చెవులకు కుండలాలు ధరించిన వాడా! అందంగా ముడిచిన కేశాలు గలవాడా!

బంగారం వంటి మేనిచ్ఛాయ గలవాడా! సుందర వేషంతో భాసిల్లువాడా! చెవులకు కుండలాలను ధరించినవాడా! మరియు పొడవాటి గిరజాల జుట్టు గలవాడా!

05. హాథవజ్ర అరు(ఔ) ధ్వజా విరాజై।
కాంథే మూంజ జనేఊ సా(చా)జై॥

చేత వస్త్రం, ధ్వజం కలిగి విరాజిల్లుతున్నవాడా! భుజస్కంధాల్లో మౌంజి, జందెములతో ప్రకాశిస్తున్నవాడా!

బలిష్టమగు నీ చేతుల్లో వజ్రము (ఇంద్రుని యొక్క ఆయుధం) మరియు జెండా కలిగినవాడా! భుజస్కంధాల్లో ముంజగడ్డితో చేసిన జంధ్యమును ధరించువాడా!

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

06. శంకర సువన కేసరీ నందన।
తేజ ప్రతాప మహాజగ వందన॥

రుద్ర వీర్యోద్భవ రుద్రమూర్తీ! కేసరీతనయుడైన హనుమంతా! గొప్ప తేజో ప్రతాపాలున్నవాడా! లోకంచేత పూజింపబడే వాడా!

శంకరుని యొక్క తేజస్సుతో ఆవిర్భవించినవాడా! కేసరీ తనయుడా! అపార తేజోప్రతాపాలున్నవాడా! అఖిలలోకాలచే నమస్కరింపబడువాడా!

07. విద్యావాన గుణీ అతి చాతుర।
రామ కాజ కరివే కో ఆతుర॥

విద్యావంతుడా, సద్గుణవంతుడా! బహు చాతుర్యం గలవాడా! రామకార్య నిర్వహణలో సతతం ఆతురత చూపేవాడా!

విద్వాంసుడా! కళ్యాణ గుణాలతో ప్రకాశించువాడా! అత్యంత తెలివిగలవాడా! రామకార్యాన్ని నెరవేర్చుటకు ఆత్రుత పడేవాడా!

08. ప్రభు చరిత్ర సునివే కో రసియా।
రామలఖ(ష)న సీతా మన బసియా॥

శ్రీరామచంద్ర ప్రభువు చరిత్రాన్ని వినటంలో రసికత్వం గలవాడా! శ్రీ సీతారామ లక్ష్మణులను హృదయసీమలో ప్రతిష్ఠించుకొన్నవాడా!

శ్రీరామచంద్రుని చరిత్ర వినటంలో రసికత్వం గలవాడా! శ్రీ సీతారామ లక్ష్మణులను హృదయమునందు ధరించువాడా!

09. సూక్ష్మ రూప ధరి సియహి దిఖావా।
వికట రూప ధరి లంక జరావా॥

సూక్ష్మరూపంతో సీతామాతకు కనిపించావు. వికటరూపం దాల్చి లంకను దహించావు.

సీతామాతకు సూక్ష్మరూపమున దర్శనమిచ్చి... భయంకర రూపముతో లంకను ధ్వంసము చేసినవాడా!

10. భీమ రూపధరి అసుర సంహారే।
రామచంద్ర కే కాజ సంవారే॥

భీకరాకారం దాల్చి రాక్షసులను సంహరించావు. రామకార్యాన్ని నిర్వర్తించావు.

భయంకర రూపాన్ని ధరించి రాక్షసులను నాశనము చేసినవాడా! శ్రీరామ కార్యాన్ని నెరవేర్చినవాడా!

11. లాయ స(ం)జీవన లఖన జియాయే।
శ్రీరఘువీర హరషి(ఖి) ఉర లాయే॥

సంజీవని తీసుకువచ్చి లక్ష్మణుణ్ణి రక్షించినావు. అందుకు శ్రీరాముడు సంతసించి నిన్ను తన హృదయానికి హత్తుకొన్నాడు.

సంజీవనిని తెచ్చి లక్ష్మణ మూర్తిని బ్రతికించినావు. అందులకు ఆనంద మొంది శ్రీరామచంద్రుడు నిన్ను హృదయానికి హత్తుకొన్నాడు.

12. రఘుపతి కీన్హీ బహుత బడాఈ।
తుమ మమ ప్రియ భరతహి సమ భాఈ॥
(కహా భరత సమ తుమ ప్రియ భాఈ)

శ్రీరాముడు ఎంతో ప్రశంచించి "నువ్వు నాకు ప్రియమైన భరతుడితో సమానమైనవాడివి" అన్నాడు.

శ్రీరాముడు నిన్ను ఘనంగా పొగిడి "సోదరా నీవు నాకు భరతునితో సమానమైన వాడవు" అని పలికెను.

13. సహస్ర(స) వదన తుమ్హరో యశ(జాస) గావైం।
అస కహి శ్రీపతి కంఠ లగావై॥

గానంచేసి శ్రీరాముడు నిన్ను ఆలింగనం చేసుకొంటూ, 'ఆదిశేషువుకూడ నీ కీర్తిని వేనోళ్ల గానం చేస్తూన్నాడు' అన్నాడు.

"వేయి ముఖాలున్న ఆదిశేషుడు నీ కీర్తిని గానం చేస్తున్నాడు. అని శ్రీరాముడు నిన్ను కౌగిలించుకున్నాడు.

14. సనకాదిక బ్రహ్మాది మునీశా।
నారద శారద సహిత అహీశా॥

సనక సనందనులు, బ్రహ్మ మొదలైనవారు, మునీశ్వరులు, నారదుడు, సరస్వతి, ఆదిశేషుడు...

సనకాది అమర ఋషులు, బ్రహ్మాది దేవతలు, మునులు, నారదుడు, సరస్వతి, ఆదిశేషుడు... వీరందరూ నీ కీర్తిని గానం చేస్తున్నారు.

15. (జమ)యమ కుబేర దిగపాల జహాం తే॥
కవి కోవిద కహి సకే కహాం తే॥

యమ, కుబేర ఆదిగా గల దిక్పాలకులు, కవులు, పండితులు మొదలైన వారు నీ కీర్తిని గానం ఎలా చెయ్యగలరు?

యముడు, కుబేరుడు, దిక్పాలకులు మొదలైనవారు కూడా నిన్ను వర్ణించలేరు, ఇక కవులు, పండితులు నిన్ను ఏమని కీర్తించగలరు? (మేము ఏపాటి? అంటాడు తులసీదాసు) నీవు సుగ్రీవునకు ఉపకారం చేశావు.

16. తుమ ఉపకార సుగ్రీవహిం కీన్హా।
రామ మిలాయ రాజపద దీన్హా॥

నువ్వు సుగ్రీవుడికి ఉపకారం చేశావు. శ్రీరామునితో స్నేహం కల్పించి సుగ్రీవుడికి రాజపదవిని యిప్పించావు.

నీవు సుగ్రీవునకు ఉపకారం చేశావు. శ్రీరామునితో స్నేహాన్ని కలిగించి కిష్కింధ రాజ్యానికి సుగ్రీవుని అధిపతిగా చేశావు.

17. తుమ్హరో మంత్ర విభీషణ మానా।
లంకేశ్వర భఏ సబ జగ జానా॥

విభీషణుడు నీ సలహాను పాటించడం వలన లంకాధిపతి అయ్యాడనే విషయం జగత్ప్రసిద్ధమేగదా!

నీ సూచనను విభీషణుడు అంగీకరించి లంకకు రాజైన సంగతి లోకం అంతటికి తెలిసినదే.

18. యుగ సహస్ర యోజన పర భానూ।
లీల్యో తాహి మధుర ఫల జానూ॥

రెండువేల యోజనాల దూరంలో వున్న సూర్యుణ్ణి మధురమైన పండుగా తలచి లీలగా స్పృశించావు.

రెండు వేల ఆమడల దూరంలో ఉన్న సూర్యున్ని... మధురమైన ఫలముగా భావించి అవలీలగా తాకావు.

19. ప్రభు ముద్రికా మేలి ముఖ మాహీ।
జలధి లాంఘి గయే అచరజ నాహీ॥

శ్రీరామచంద్రుని ముద్రికను నోట వుంచుకొని సముద్రాన్ని లంఘించినా వంటే ఆశ్చర్యం ఏముంది?

శ్రీరాముడు తన ఆనవాలుగా ఉంగరమును ఇస్తే దాన్ని నోట కరచుకొని సాగరాన్ని దాటడములో ఆశ్చర్యం ఏముంది?

20. దుర్గమ కాజ జగత కే జేతే।
సుగమ అనుగ్రహ తుమ్హరే తేతే॥

లోకంలో దుర్గమమైన ఏ కార్యమైనా నీ అనుగ్రహంతో సుగమం అవుతుంది.

విశ్వంలో అసాధ్యమైన కార్యాలు నీ అనుగ్రహము వలన సులువు కాగలవు.

21. రామ దుఆరే తుమ రఖవారే।
హోత న ఆజ్ఞా బిను పైసారే॥(పైఠారే)

నువ్వు శ్రీరాముని వాకిలి కాచేవాడవి. నీ అనుమతి లేకుండా లోనికెళ్లటం వీలుపడదు.

నువ్వు శ్రీరామ ద్వారానికి కాపలా కాచేవాడవు. నీ అనుమతి లేనిదే ఎవరూ లోపలికి వెళ్ళడానికి వీలుపడదు.

22. సబ సుఖ లహై తుమ్హారీ శరణా(నా)।
తుమ రక్షక కాహూ కో డర నా॥

నిన్ను శరణు వేడితే సర్వసౌఖ్యాలు చేకూరుతాయి. నీ రక్షణలో ఎవరూ భయపడ వలసిన అవసరం లేదు.

నిన్ను ఆశ్రయించిన వారికి సమస్త సుఖములు లభించగలవు. నీ రక్షణలో ఉండినచో ఎవరికి భయపడనవసరము లేదు.

23. ఆపన తేజ సం(తు)మ్హారో ఆపై।
తీనోం లోక హాంక తేం కాంపై॥

నీ తేజస్సును నువ్వే నిభాయించుకో గలవు. నీకు ముల్లోకాలు గడగడ లాడతాయి.

నీ తేజస్సును నువ్వే పర్యవేక్షించుకోగలవు. నీ ఒకే ఒక్క కేకతో ముల్లోకాలు కంపించిపోగలవు.

24. భూత పిశాచ నికట నహిం ఆవై।
మహావీర జబ నామ సునావై॥

మహావీరా! నీ పేరు వింటేనే భూతప్రేత పిశాచ గణాలు సమీపించలేవు.

ఓ మహావీరా! నీ నామస్మరణతో భూతప్రేత పిశాచాదులు దగ్గరకు రాలేవు.

25. నాసై రోగ హరై సబ పీరా।
జపత నిరంతర హనుమత వీరా॥

వీరహనుమంతుణ్ణి సదా జపిస్తే సర్వరోగాలు నయమవుతాయి. పీడలు తొలగిపోతాయి.

నిరంతరము హనుమంతుని స్మరించినచో రోగాలన్ని నశించిపోవును. సమస్త పీడలు తొలగిపోవును.

26. సంకట (తేం)సేం హనుమాన ఛుడావై।
మన క్రమ వచన ధ్యాన జో లావై

మనోవాక్కాయాలతో ఎవరు హనుమంతుణ్ణి ధ్యానిస్తారో వారిని అతడు అన్ని కష్టాల నుంచి కాపాడతాడు.

త్రికరణశుద్ధిగా హనుమంతుని స్మరించు వారిని ... సమస్త సంకటముల నుండి బయటపడవేయును.

27. సబ పర రామ (రాయసిర)తపస్వీ రాజా।
తినకే కాజ సకల తుమ సాజా॥

రాజులందరికీ శ్రీరాముడు కిరీటం వంటివాడు. తపస్సంపన్నులకు ప్రభువు వంటి వాడు. నువ్వు రామ కార్యాలన్నింటిని సక్రమంగా నెరవేరుస్తుంటావు.

శ్రీరాముడు రాజులందరికి కిరీటం వంటి వాడు. మునులందరికీ ప్రభువు అయిన శ్రీరామచంద్రుడి కార్యములన్నీ చక్కగా నెరవేర్చినది నీవే కదా!

28. ఔర మనోరథ జో కోఇ లావై।
సోఈ(తాసు) అమిత జీవన ఫల పావై।

(హనుమంతుని భక్తులు) నీ భక్తులు మనో రథాలన్నీ పొందటమేగాక, శాశ్వతానంద దాయకమైన మోక్షఫలాన్ని కూడా పొందుతారు.

సంపూర్ణ విశ్వాసంతో, చిత్తశుద్ధితో కోరికలు నెరవేర్చుకోవడానికి ఎవరైతే నీ వద్దకు వస్తారో - వారు శాశ్వతానందదాయకమైన జీవన (మోక్ష) ఫలాలను అమితంగా పొందుతారు.

29. చారోఁ యుగ (ప్రతాప)పరితాప తుమ్హారా।
హై పరసిద్ధ జగతఉజియారా॥

నీ ప్రతాపం నాల్గుయుగాల్లోను ప్రసిద్ధం. నీ కీర్తి ప్రపంచమంతా ఉజ్వలంగా ప్రకాశిస్తోంది.

నీ ప్రతాపం నాలుగు యుగాలలోను (సత్య, త్రేతా, ద్వాపర మరియు కలియుగం) ప్రసిద్ధి చెందింది. దానిచే నీ కీర్తి జగమంత దివ్యముగా ప్రకాశిస్తుంది.

30. సాధు సంత కే తుమ రఖవారే।
అసుర నికందన రామ దులారే॥

సాధువులనూ, సజ్జనులనూ రక్షిస్తుంటావు. రాక్షసులను సంహరించి శ్రీరామునికి ప్రేమస్పదుడవైనావు.

సాధు జనుల్ని నీవు సంరక్షిస్తుంటావు. రాక్షసులను అంతము చేశావు. శ్రీ రామునకు ప్రేమ పాత్రుడైనావు.

31. అష్ట సిద్ధి (నౌ)నవ నిధి కే దాతా।
అస వర దీన్హ జానకీ మాతా॥

అణిమాద్యష్టసిద్ధులను, నవ నిధులను సంప్రాప్తింప చేసేవాడివి. అదే వరాన్ని సీతాదేవి నీకు ఒసగివుంది.

అష్ట సిద్ధులను మరియు నవ నిధులను ప్రసాదించే శక్తిమంతుడవు. ఆ శక్తిని నీకు జానకీదేవి వరంగా ప్రసాదించింది.

అష్ట సిద్ధులు:- అణిమ, మహిమ, లఘిమ, గరిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము.

నవ నిధులు:- మహాపద్మము, పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుందము, కుందము, నీలము, ఖర్వము.

32. రామ రసాయన తుమ్హారే పాసా।
(సాద)సదా రహో రఘుపతి కే దాసా॥

నీవద్ద రామరసాయనం వుంది. నువ్వు శ్రీరామునికి నమ్మినబంటువు.

నీ వద్ద రామరసాయనము అను నామామృతం ఉంది. నీవు శ్రీరామ చంద్రునకు శ్రద్ధగలవాడైన దాసుడవు.

Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

33. తుమ్హరే భజన రామకో పావై।
జన్మ జన్మ (జనమ జనమ) కే దుఃఖ బిసరావై॥

నిన్ను (మేము) సేవించటం, శ్రీరామునికి సంతోషం కలిగిస్తుంది. జన్మ జన్మాంతరాల దుఃఖాన్ని ఉపశమింపచేస్తుంది.

నిన్ను భజించడం శ్రీ రామచంద్రునికి ఆనందదాయకము. తద్వారా జన్మ జన్మాంతరముల దుఃఖం దూరమైపోవును.

34. అంత కాల రఘు(పతి)వర పుర జాఈ।
జహాఁ జన్మ హరిభక్త కహాఈ॥

నీ భక్తుడు చనిపోయి రామ లోకాన్ని పొంది, హరి భక్తుడుగా జన్మిస్తాడు.

నీ భక్తుడు అంత్యకాలమున శ్రీరామ లోకాన్ని పొంది తదుపరి జన్మలో హరిభక్తుడిగా జన్మిస్తాడు. / హరిభక్తులని పిలువబడతారు.

35. ఔర దేవతా చిత్త న ధరఈ।
హనుమత సేఇ సర్వ సుఖ కరఈ।

ఇతర దేవతలను మనస్సులో తలచుకోక, హనుమంతుణ్ణే సేవిస్తే సర్వ శుభాలను ప్రసాదిస్తాడు.

ఇతర దేవతలను మనస్సులో తలవక హనుమంతుణ్ణి సేవిస్తే సర్వసుఖములు కలుగును.

36. సంకట క(హ)టై మిటై సబ పీరా।
జో సుమిరై హనుమత బల వీరా॥

Kiron Type Institute

బలవంతుడూ, వీరుడూ ఐన హనుమంతుణ్ణి ఆరాధిస్తే, కష్టాలన్నీ, పీడలన్నీ తొలగిపోతాయి. పటాపంచ లైపోతాయి.

బలవీరుడగు హనుమంతుణ్ణి స్మరించినచో సకల పీడలు, సంకటములు తొలిగిపోవును.

37\. జై జై జై హనుమాన గోసాఈ।
కృపా కరో(కరజహు) గురు దేవ కీ నాఈ।

ఓ ఆంజనేయ! నీకు జయమగు గాక; ఓ గురుదేవా, మమ్మల్ని అనుగ్రహించు.

ఓ ఆంజనేయ స్వామి నీకు జేజేలు. శ్రీగురు దేవునిలా మమ్మల్ని అనుగ్రహించు.

38\. జో(యహ) శత వార పాఠ కర కోఈ।
ఛూటహి బంది మహా సుఖ హోఈ॥

ఈ 'హనుమాన్ చాలీసా'ను నూరుమార్లు ఎవరు పారాయణం చేస్తారో వారు బంధాలనుండి విడివడి సౌఖ్యాన్ని పొందుతారు.

ఈ స్తోత్రాన్ని నూరుసార్లు పఠించినవారు బంధ విముక్తులై మహా సుఖమును పొందుతారు.

39\. జో యహ పఢై హనుమాన చా(చ)లీసా।
హోయ సిద్ధి సాఖీ గౌరీశా(సా)॥

అతి ప్రశస్తమైన యీ 'హనుమాన్ చాలీసా'ను ఎవరు పారాయణం చేస్తారో వారు పార్వతీ పరమేశ్వర సాక్షిగా సిద్ధి పొందుతారు.

హనుమాన్ చాలీసా అనే ఈ స్తోత్రాన్ని పఠించువారికి పార్వతీ పరమేశ్వరుల సాక్షిగా విజయం కలుగును.

40. తులసీదాస సదా హరి చేరా।
కీజై నాథ హృదయ మహ డేరా॥

భక్తుల్లో అగ్రగణ్యుడైన తులసీదాసు ఎప్పుడూ శ్రీహరికి దాసుడే! ఓ ప్రభూ! నువ్వు నా హృదయసీమలో నివసించు.

తులసీదాసు యెల్లప్పుడు హరిదాసే (హరికి దాసుడే). ఓ నాథా నీవు నా హృదయంలో ఉండుము.

దోహా

పవన తనయ సంకట హరణ – మంగళ మూరతి రూ(ప)ప్।
రామ లఖన సీతా సహిత – హృదయ బసహు సుర భూ(ప)ప్।

సంకట నాశకుడు, మంగళరూపుడు, దేవతాధిపతీ, పవనతనయుడు అయిన నువ్వు శ్రీ సీతారామ లక్ష్మణులతో కూడి సదా నా హృదయంలో ఆసీనుడవు కమ్మని ప్రార్థిస్తూన్నాను.

కష్టములను హరించువాడవును, మంగళ స్వరూపుడవగు ఓ ఆంజనేయా! సీతారామ లక్ష్మణ సమేతుండవై దేవతలతో నీవు నా హృదయ మండలమున ఉండుము.

సియావర రామచంద్రకీ జయ।
పవనసుత హనుమానకీ జయ।
బోలో భాఈ సబ సంతనకీ జయ।

– – – = – – –

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.–944 044 9650, 994 994 1430)